బీమా..కనిపించని ధీమా

- పంటల ఉచి బీమాపై నీలినీడలు
- ఇంత వరకు విధానం ప్రకటించని ప్రభుత్వం
- భారీ వర్షాలతో నీట మునిగిన పంట పొలాలు
- సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో 1.01 లక్షల ఎకరాల్లో సాగు

సత్తెనపల్లి: సాగులో రైతుకు ధీమానిచ్చే పంటల బీమా పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. గత నెల ఆగస్టుతో ప్రీమియం చెల్లింపునకు గడువు ముగిసింది. ప్రస్తుత సెప్టెంబర్‌లో రెండు వారాలు గడిచిపోయాయి. అయినా పాలసీ విధివిధానాలు ప్రకటించ లేదు. సాగు కాలంలో విపత్తులతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం ఎంతో దోహదపడుతుంది. బీమా కంపెనీ లెక్కించిన పంట విలువలో రైతులు ఐదు శాతం వాటా చెల్లించాలి. గతంలోనూ టీడీపీ హయాంలో ఫసల్ బీమా యోజన ద్వారా ప్రీమియంలో మూడు శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తే మిగిలిన రెండు శాతం రైతులు చెల్లించుకునేవారు. రైతులు వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే సమయంలో పంటకు బీమా చేయించేవి. మిగిలిన రైతులకు ప్రీమియం గడువుపై సరైన సమాచారం లేకపోవడం, పంట రుణాల విడుదలలో జాప్యం తదితర కారణాలతో చాలామంది ప్రీమియం చెల్లించకపోవడం వల్ల విపత్తులు ఏర్పడిన


పొలం పనుల్లో నిమగ్నమైన రైతు

ప్పుడు పరిహార అందక నష్టపోవాల్సి వచ్చేది. దీనికి తోడు ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) కూడా ఆరు నెలలకో, ఏడాదికో ఇవ్వడం వల్ల పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ప్రస్తుతం చాలా మంది రైతులు పంటలకు బీమా చేయించుకున్నా ఇంతవరకు విధివిధానాలు విడుదల చేయకపోవడం శోచనీయం.

డివిజన్‌లో 1.01 ఎకరాల్లో పంటలు..

రైతు పక్షపాతిగా పేరు పొందిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన హయాంలో రైతుపై భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. ఎకరానికి రూ. 29 వేలు బీమా కాగా రైతు వాటా రెండు శాతం రూ.580 చొప్పున ఎన్ని ఎకరాలు సాగులో ఉంటే అన్నింటికీ ప్రభుత్వమే చెల్లించేది. దీంతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందేది. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,01,570 ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటలు సాగవుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట కీలక దశలో నీట మునిగింది.

స్పష్టత కరువు...

పంటల బీమా పథకం అమలుపై కూటమి ప్రభుత్వం నేటికీ ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. రైతుల భాగస్వామ్యం లేకుండా పంటల బీమా ఏంటని ఇటీవల సీఎం చంద్రబాబు అన్నారు. దీంతో గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం అమలును ప్రశ్నార్థకం చేస్తోంది. మరోపక్క అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు ఏటా ఇస్తామన్న రూ. 20 వేల సంగతీ తేలలేదు. క్రాప్ బీమా ప్రీమియం చెల్లింపునకు ఆగస్టు 31తో గడువు ముగిసింది. గడువు పెంచుతారని రైతులు, వ్యవసాయ అధికారులు భావిస్తున్నా యంత్రాంగం నుంచి సమాధానం లేదు. రైతులు ప్రీమియం చెల్లించాలని గాని, గత ప్రభుత్వం మాదిరి ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తామని గాని, గడువు పెంచుతామని గాని కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడం రైతులను కలవరపరుస్తోంది.

సామాన్యుడి నడ్డి విరుస్తున్న అధిక ధరలు

అమరావతి: నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటి సామాన్య ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నాయని సీపీఎం అమరావతి కార్యదర్శి బి.సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్యులు ధరల పెరుగుదలతో నిత్యాసరాలు కొనుగోలు చేయలేకపోతున్నారని తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో ఇళ్ల, పంటలు మునిగిపోవడం మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ధరలు తగ్గించకపోతే ప్రజల వ్యతిరేకత తప్పదని తెలిపారు.

సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు

క్రోసూరు: జీవో నంబరు 85 రద్దు కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్నారు. మంగళవారం పీహెచ్‌సీకి హాజరు కాలేదు. రోగులను స్టాఫ్ నర్సులే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. మంగళవారం 62 ఓపీ వచ్చినట్లు పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్ తెలిపారు.

క్రోసూరు ప్రజా సమస్యలు పరిష్కరించాలి

క్రోసూరు: క్రోసూరు గ్రామంలో పేరుకుపోయిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రవి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం క్రోసూరు గ్రామ శాఖ మహాసభ ఆమంచి భవన్ లో జి.ఎలిశమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రవి బాబు మాట్లాడుతూ స్థానిక బస్టాండ్ సెంటర్లో చిరు వ్యాపారాలు, ప్రయాణికులు మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 3,600 కుటుంబాలు జీవిస్తున్న గ్రామంలో మంచి నీటి సౌకర్యం అరకొరగానే ఉందన్నారు. చెరువును మంచినీటి కోసం ప్రత్యేకంగా కేటాయించి ఇంటింటికి కుళాయి ద్వారా నీటిని అందించాలని కోరారు. దొడ్లేరు రోడ్డు వైపు నివాస ప్రాంతాలకు చెరువు కట్టకు మధ్య డ్రెయినేజీ కాల్వలు ఏర్పాటు చేసి, మురుగు సమస్యను పరిష్కారించాలని కోరారు. అమరులైన కామ్రేడ్స్‌కు ఘన నివాళలర్పించారు. సీపీఎం కోసూరు శాఖ కార్యదర్శిగా చిలక ఏసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి హనుమంతరావు, అనూష పాల్గొన్నారు.



క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే శంకరరావు జన్మదిన వేడుకలు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గాన్ని సంక్షేమం, అభివృద్ధిలో అత్యున్నత స్థాయిలో ఉంచిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జన్మదినోత్సవ వేడుకలను ప్రతి గ్రామంలో నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద శంకరరావు జన్మదిన కేక్ కటింగ్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఇదో రకం పైశాచికం



పీసపాడు(క్రోసూరు) : అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ కార్యకర్తల అరాచకాలు,పైశాచిక చర్యలు పెచ్చురిల్లుతున్నాయి. పీసపాడు గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ వర్గీయులు నిమ్మల బాయి సెంటర్‌లో ఏర్పాటు చేసుకున్న గణనాథుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా మార్గంలో లేని వైఎస్సార్సీపీ కార్యకర్త అల్లు కేశవరెడ్డి ఇంటి వద్దకు టీడీపీ కార్యకర్తలు వెళ్లి పుసుపు రంగు ఇంట్లో, ఇంటి వద్ద కారుపై పడే విధంగా చల్లారు. గ్రామ పార్టీ నాయకులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇటువంటి చర్యలు మానుకోవాలని కోరారు.

లడ్డూ ప్రసాదం రూ.1.10 లక్షలు



నకరికల్లు: స్థానిక కొండయ్య గుడి సెంటర్‌లో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్తరాది నుంచి వచ్చిన కళాకారుల నృత్యాల నడుమ డీజే వాయిద్యాలతో నిమజ్జనం కోలాహలంగా సాగింది. స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం పాటలో గ్రామానికి చెందిన పాలూరి రాజశేఖర్‌రెడ్డి రూ.1.10 లక్షలకు దక్కించుకున్నారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

క్రోసూరు: రైతులు సాగు చేసిన పంటలను ఈ-పంట యాప్‌లో నమోదుకు, ఈ-కేవైసీకి ఈనెల 23వ తేదీ గడువు ఉత్తర్వులిచ్చినట్లు ఏడీఏ వి.హనుమంతరావు మంగళవారం తెలిపారు. బయ్యవరం రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ పర్యవేక్షించి, రైతులతో మాట్లాడారు. ఏడీఏ మాట్లాడుతూ.. మండలంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి, పంట నమోదు అయ్యిందా లేదా అనేది తెలుసుకోవాలన్నారు. ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

రూ.30వేలు నష్ట పరిహారం ఇవ్వాలి

పెదకూరపాడు: భారీ వర్షాల కారణంగా పెదకూరపాడు, క్రోసూరు, అమరావతి, అచ్చంపేట మండలాల్లో కృష్ణానది పరీవాహక ప్రాంతంలో పత్తి రైతులు నష్టపోయారని నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటీ శ్రీనివాసరావు అన్నారు. పెద్దకూరపాడులో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులకు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినత పత్రాన్ని అందించారు. కౌలు రైతులు పత్తి పంటలో ఎకరానికి రూ. 50 వేలు పెట్టుబడి పెట్టారన్నారు. ఎకరానికి రూ. 30 వేలు నష్ట పరిహారం అందించాలని అధికారులను కోరారు. మలినేని బసవయ్య, చిర్రా సాంబిరెడ్డి, సాబ్జాన్, మస్తాన్‌వలి, సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, షేక్ నాగుల్ మీరా, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

బెల్లంకొండ: మండలంలోని కందిపాడు గ్రామంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నియోజకవర్గ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ గౌరవాధ్యక్షుడు సిద్దు కామేశ్వరాచారి, అధ్యక్షుడు నూతక్కి సత్యనారాయణ చారి, ప్రసాదాచారి, గోపాల్ రావు, వసంతమ్మ, వెంకట నరసయ్య, శ్రీను, గోపయ్య పాల్గొన్నారు.

ఖాతాదారులకు సకాలంలో సేవలందిస్తాం

రాజుపాలెం: ఖాతాదారులకు సకాలంలో సేవలందించేందుకు చర్యలు చేపడతామని బీఆర్‌ఎం సుమన్ తెలిపారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో పెన్షన్ దారులకు, వినియోగదారులకు బ్యాంక్ సేవలపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ రీజినల్ మేనేజర్ సుమన్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలపై అభిప్రాయాలు తెలపాలని కోరారు. దీంతో పెన్షన్ దారులు, వినియోగదారులు ఇక్కసారిగా బ్యాంక్ సేవలపై దుమ్మెత్తి పోశారు. కొత్త ఖాతా తెరవాలంటే రెండుమూడు రోజులు పడుతుందని, డబ్బులు తీసుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పడుతోందని మండిపడ్డారు. ఖాతా పుస్తకాలను ప్రింట్ చేయాలంటే ప్రింటర్ పనిచేయడం లేదని సిబ్బంది చెబుతున్నారని వాపోయారు. ఆంధ్రాబ్యాంక్ ఉన్నప్పుడే



వినియోగదారులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎం సుమన్

సకాలంలో పనులు జరిగాయని, యూనియన్ బ్యాంక్ ఏర్పడిన తర్వాత కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ శైలేష్ భగత్ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్‌ఎం లలితాకర్, మార్కెట్ సిబ్బంది బాషా, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ల నిరసనకు ప్రభుత్వం స్పందించాలి

అచ్చంపేట: తమకు నష్టం కలిగించే జీవో 85ను వ్యతిరేకిస్తూ విజయవాడలో ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన డాక్టర్ల ప్రదర్శనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవంతి కోరారు. ప్రభుత్వం వెంటనే జీవోను విరమించుకోవాలని, పీజీ సీట్లలో ఇన్‌సర్వీస్ డాక్టర్లకు రిజర్వేషన్లు కల్పించాలనికోరారు.

అనంత పద్మనాభ స్వామి వ్రతం

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో మంగళవారం అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు అంకారావు మాస్టారు పాల్గొని పూజా కార్యక్రమాలు చేయించారు. లోక కల్యాణ కోసం పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తిశ్రద్ధలతో వ్రతం నిర్వహించడం వల్ల పాడి పరిశ్రమ ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ, రామకృష్ణ, సుబ్బారావు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్యం మెరుగుపరచడమే లక్ష్యం


మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ


చాగంటివారిపాలెంలో ర్యాలీ..


నకరికల్లులో మానవహారం

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వభావ స్వచ్ఛతా- సంస్కార్ స్వచ్ఛతా అనే నినాదంతో స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద నుంచి బైపాస్ రోడ్డు వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, మునిసిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంటివారిపాలెంలో స్వచ్ఛత హీ సేవా

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం బుధవారం జరిగింది. ఎంపీడీవో కార్యాలయం నుంచి గ్రామ సచివాలయం వరకు మండల స్థాయి అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ప్లాంట్ ఫర్ మదర్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీవో పి.పుట్టారెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 1 వరకు పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామస్తుల సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఈఓపీఆర్డీ ఎస్.రూపవతి, ఏపీఓ ఏడుకొండలు అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచడమే ధ్యేయం

బెల్లంకొండ: గ్రామాలలో అపరిశుభ్రతను తొలగించి, పారిశుద్ధ్యం మెరుగుపరచడమే ధ్యేయంగా 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అన్నీ గ్రామాలలో కార్యక్రమంలో భాగంగా మానవ హారాలు నిర్వహించారు. నందిరాజుపాలెం గ్రామంలో ఎంపీడీవో పాల్గొని పారిశుద్ధ్య చర్యలపై పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలలో ఏవో కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మానవహారం

నకరికల్లు: స్వచ్ఛతలోనే ఆరోగ్యం దాగి ఉందని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. సచ్ఛ సేవ-స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నులిపురుగులను నులిమేద్దాం!

అచ్చంపేట: నులి పురుగులను దరిచేరకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు సూచించారు. నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మంగళవారం అల్బెండజోల్ మాత్రలు మింగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, సచివాలయ ఏఎన్‌ఎం నర్సమ్మ, మహిళా శిశు సంరక్షణా కార్యదర్శి జయలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రలిచ్చేవారు కూడా లేరు

సత్తెనపల్లి: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేయాల్సి ఉండగా వాయిదా వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మె చేస్తుండటంతో ఆల్బెండజోల్ మాత్రలు వికటిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన వైద్య ఆరోగ్యశాఖ ఈ మాత్రల పంపిణీ నిలిపివేసింది. ఈ నెల 25న తిరిగి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.


అల్బెండజోల్ టాబ్లెట్స్ మింగిస్తున్న డాక్టర్ వెంకట్రావు

సాంఘిక సమానత్వానికి పెరియార్ పోరాటం

సత్తెనపల్లి: సాంఘిక సమానత్వం కోసం పోరాడిన యోధుడు పెరియార్ రామస్వామి అని బీసీ సంఘ నాయకుడు పత్తిపాటి హరే కృష్ణ అన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి 145వ జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పత్తిపాటి హరే కృష్ణ, బీసీ సంఘ నాయకులు అంకమ్మరావు, దస్తగిరి, కోటయ్య, గొట్టం వెంకటేష్, షేక్ చిన్న షరీఫ్, చావల వెంకటేశ్వర్లు, మల్లా వెంకటేశ్వర్లు, మాదల నాగేశ్వరరావు ఉన్నారు.



వావిలాల సంస్థకు అండగా ఉంటాం

సత్తెనపల్లి: స్వాతంత్ర సమర యోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని, వావిలాల స్థాపించిన సంస్థకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో వరదల కారణంగా ఇబ్బంది పడ్డ బాధితులకు అండగా నిలిచేందుకు వావిలాల గోపాలకృష్ణయ్య కుటుంబ సభ్యులు రూ.లక్ష చెక్కుతోపాటు 500 మంది బాధితులకు సరిపడా దుస్తులను సీఎం చంద్రబాబును కలిసి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వావిలాల వారసుడు, సంస్థ ఉప కార్యదర్శి మన్నవ సోడేకర్ ముఖ్యమంత్రితో మాట్లాడుతూ వావిలాల తెలుగు



భాష కోసం, గ్రంథాలయాల స్థాపన కోసం, మద్యపానం నిషేధం కోసం చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. గ్రామీణ అభివృద్ధే దేశ అభివృద్ధి అని భావించిన ఆయన ఆలోచనలను, ఆశయాలను ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రూరల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో వావిలాల సంస్థను భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. సంస్థ చైర్మన్ వావిలాల లీలా మహేశ్వరి, అధ్యక్షులు వావిలాల సత్యం, కార్యదర్శి వావిలాల రమా ఉన్నారు.

ఘనంగా వావిలాల జయంతి

పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో స్వాతంత్ర్య సమరయోధుడు, సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతి వేడుకలు జనసేన ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వావిలాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్, నాయకులు నాదెండ్ల నాగేశ్వరరావు, బత్తుల కేశవ, చిలకా పూర్ణ, సిసింద్రీ తదితరులు ఉన్నారు.

